క్లుప్తంగా

నేడు శివాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ తెలిపారు. ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గేటు వసూళ్లలో గొడవ

యాదమరి: చిత్తూరు నగరం ప్రశాంత్‌నగర్‌లోని కూరగాయల సంతకు సంబంధించిన గేటు వసూళ్లలో ఆదివారం గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో కొందరి వ్యక్తుల మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారితీసింది. యాదమరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిసింది. ఈ మేరకు కేసులు నమోదవుతాయని స్థానికులు చెబుతున్నారు.

త్రిశతి పుస్తకావిష్కరణ



చిన్ని సూక్తి త్రిశతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని తపోవనంలో ఆదివారం గుడివాడ అన్నయ్య నాయుడు రచించిన చిన్ని సూక్తి త్రిశతి పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పంచ సహస్రావధాని మేడసాని మోహన్ చేతుల మీదుగా పుస్తక ఆవిష్కరణ చేశారు. డాక్టర్ మేడసాని మోహన్ మాట్లాడుతూ సంప్రదాయ విలువలను ప్రతిబింబించేది ప్రాచీన సాహిత్యమే నన్నారు. ప్రజల్లోకి ఎంత ఎక్కువగా వెళితే అంతా గొప్పగా సమాజం తీర్చిదిద్దుకుంటుందన్నారు. అనంతరం రచయితను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు రచయితలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరమని అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి అన్నారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండులో ఆదివారం అగ్నిమాపక శాఖ అధికారులు అగ్ని ప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది కరుణాకర్, ఏసుపాదం, శోభన్, రాజు, గిరిబాబు, కుశలన్, నవీన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

కనుల పండువగా స్నపన తిరుమంజనం

కార్వేటినగరం: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలుడి స్నపన తిరుమంజనం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామివారిని సుప్రభాత సేవలో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన, కొలువు తదితర నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు.



ఊరేగుతున్న శ్రీవేణుగోపాల స్వామి

తరలి రాద తనే వసంతం



వసంత రుతువు ఆరంభం కావడంతో ఆకులు రాలిన చెట్లన్నీ కొత్త చిగురిస్తున్నాయి. తరలి రాద తనే వసంతం .. తన దరికి రాని వనాల కోసం.. అంటూ ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. గుడిపాల మండలంలోని చిత్తూరు–వేలూరు రహదారిలో పానాటూరు గ్రామం వద్ద ఉన్న రావిచెట్టు నెల రోజుల క్రితం ఆకులన్నీ రాలిపోయి మోడుబారి పోయి కనిపించింది. నేడు కొత్త చిగుళ్లతో పచ్చదనం సంతరించుకుంది. చెట్టు నిండా పచ్చని ఆకులతో అందంగా తయారైంది. ఈ మార్గంలో ప్రయాణించే విద్యార్థులు కొందరు ఎండ తీవ్రతకు కాసేపు ఈ చెట్టుకింద సేద తీరుతూ వెళుతున్నారు. మోడుబారిన చెట్టు పరాజయాలకు సాక్ష్యంగా నిలిస్తే, నిండా పచ్చదనం పరుచుకున్న చెట్టు విజయగర్వాన్ని చాటుతోంది. –గుడిపాల



సర్వేలు ఫుల్.. సేవలు నిల్

- సచివాలయ సేవలకు స్వస్తి పలికిన కూటమి సర్కార్
- సిబ్బందితో వివిధ రకాల సర్వేలు
- సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రాలకు పరుగులు

బంగారుపాళెం: సచివాలయాలకు కూటమి గ్రహణం పట్టింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని సేవలు ఇంటి గడప ముందుకు తీసుకువచ్చి పాలన సులభతరం చేసింది. ఓర్వలేక కూటమి ప్రభుత్వం కక్షగట్టి గ్రామ సచివాలయాలను నిర్వీర్యం చేసింది. అధికారంలోకి వచ్చిన తరువాత సేవలను పక్కనపెట్టి సర్వేల పేరుతో సచివాలయ సిబ్బందిని ఇంటింటా తిప్పుతోంది. దీంతో ప్రజలకు సచివాలయంలో సేవలు అందకపోవడంతో వారు తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం మీ సేవా కేంద్రాలకు, మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది.

ఉద్యోగులపై పని భారం

మండలంలో 27 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. అందులో దాదాపు 260 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రతి శాఖకు ఒక ఉద్యోగం చొప్పున ప్రతి సచివాలయంలో 11మందిని నియమించారు. గత ప్రభుత్వ హయాంలో సచివాలయ సిబ్బంది వలంటీర్ల సమన్వయంతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అవసరమైన సర్టిఫికెట్ నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వరకు అన్ని సేవలను గ్రామ సచివాలయంలో అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ సేవలకు స్వస్తి పలికింది. సచివాలయ సిబ్బందిపై వివిధ రకాల సర్వేల పేరుతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. సెలవు రోజులతో సంబంధం లేకుండా సర్వేలు చేయాలని ఆదేశించడం, టార్గెట్‌లు పెట్టి మరీ మాతృశాఖ పనులతో పాటు బీఎల్‌ఓ విధులు ఇలా అన్ని రకాల పనులను చేయాలని ఆదేశిస్తోంది. దీంతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. సర్వేల కోసం సచివాలయ ఉద్యోగులు వీధివీధినా తిరగడంతో సచివాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న వీఏఏలు సర్వేల పేరుతో బయటకు వెళ్లడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



తగ్గువారిపల్లె గ్రామ సచివాలయం

వివిధ రకాల సర్వేలు..

సచివాలయ సిబ్బందిని సర్వేల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆధార్ లేని పిల్లలను గుర్తించి వారికి ఆధార్ నమోదు చేయించాలి. పుట్టిన పిల్లలకు జనన ధృవీకరణ పత్రం, ఆధార్ నమోదు ప్రక్రియ నిర్వహించాల్సి ఉంటుంది. వర్క్‌ఫ్రమ్ హోం పేరుతో 18 నుంచి 50 ఏళ్ల వయసు లోపు ఉన్న వారి జాబితా తయారు చేయాల్సి ఉంటుంది. పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ భాగస్వామ్యంతో పి ఫోర్ సర్వే, నాన్ ఏపీ రెషిడెన్షియల్ వారిని గుర్తించడం, హౌస్ జియో ట్యాగింగ్ వంటి సర్వేలు చేయిస్తున్నారు. ఇంటింటా తిరిగి సర్వే చేస్తున్న ఇంటి యజమాని సెల్ ఫోనుకు వచ్చిన ఓటీపీ చెప్పకపోతే చేసిన పని అంతా వృథా అవుతోంది. మరి మొదటి నుంచి చేయాల్సి ఉంటుందని పలువురు వాపోతున్నారు.

గత ప్రభుత్వంలో అన్ని రకాల సేవలు అందేవి

గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలు అందేవి. ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాలపై సమాచారం అందించేవారు. ఏదైనా పత్రాలు కావాలన్నా, దరఖాస్తు చేయాలన్నా సచివాలయాలకే వచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సర్టిఫికెట్లు కావాలంటే మీ సేవా కేంద్రాలకు లేదా మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

–గోపి, నిరుద్యోగ అభ్యర్థి

ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు

గతంలో ఏ చిన్న అవసరం వచ్చినా గ్రామ సచివాలయానికి వెళ్లి పనులు చేసుకునేవారు. సచివాలయంలో సిబ్బంది అందుబాటులోలేకపోవడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. మీ సేవా కేంద్రాలు, మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు అందించాల్సిన సేవలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మళ్లీ వైఎస్సార్‌సీపీ పాలన వచ్చే వరకు ఇదే పరిస్థితి.

–గజేంద్ర, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన ఉంటుందని, అందులో ప్రజల ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

ఐరాల తహసీల్దార్ కార్యాలయంలో..

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తామని చెప్పారు. మండల ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా సమర్పించి పరిష్కరించుకోవాలన్నారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రెడ్డిబాబు, తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిశీలించి విచారించి పరిష్కరిస్తామని వివరించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

బిక్కుబిక్కుమంటూ..



ప్రస్తుతం గుడిపాల మండలంలో నెలకొన్న వాతావరణ పరిస్థితులతో వరి రైతులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. రెండు రోజులుగా సాయంత్రం సమయంలో బలమైన ఈదురుగాలులతో పాటు వర్షం వచ్చే సూచనలు కనిపిస్తుండడంతో చేతికి వచ్చిన పంట నేలపాలవుతుందేమో అన్న భయం రైతులను వెంటాడుతోంది. ఇప్పటికే అక్కడక్కడా పంట నేలవాలుతోంది. మరో పదిరోజుల్లో కోత కోయాల్సి ఉండగా ఇప్పుడు వీస్తున్న ఈ ఈదురుగాలులు అన్నదాతలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. –గుడిపాల

వేలిముద్రలు వేయించుకున్నారు.. బియ్యం ఇవ్వరే?



పుల్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

ఐరాల: వేలిముద్రలు వేయించుకొని.. తాము తీసుకోకుండా బియ్యం ఎక్కడికి పోతాయ్. ఎప్పుడు పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లి వీఆర్‌ఓను అడిగినా లేదంటూ సమాధానం చెబుతున్నారంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పుల్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద రేషన్ కార్డులు చేతపట్టుకొని మహిళలు ఆదివారం ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లగా తమ ప్రాంతానికి చెందిన డీలర్ చంద్ర చౌకదుకాణంలో బియ్యం, కందిపప్పు, చక్కెర తదితర నిత్యావసర సరుకులు ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వెళ్లినా అందించేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక స్థానిక కూటమి నేతలు వారికి సంబంధించిన వ్యక్తికి ఇవ్వాలని తమ ప్రాంతానికి చెందిన డీలర్‌ను తొలగించారని వాపోయారు. దీంతో డీలర్ చంద్ర హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అధికారులు తమ పంచాయతీ కార్యాలయంలో వీఆర్‌ఓ ఆధ్వర్యంలో రేషన్‌షాపు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. తమ ప్రాంతంలో 320 మంది రేషన్ కార్డుదారులు ఉన్నారని చెప్పారు. నాలుగు నెలలుగా వీఆర్‌ఓ యల్లప్ప మొదటి రోజు వెళ్లిన వారికి మాత్రమే వేలిముద్రలు వేయించుకొని బియ్యం అందజేస్తున్నారు. మిగిలినవారు ఎప్పుడు వెళ్లినా బియ్యం లేవంటున్నారని, వీఆర్‌ఓ సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రతి నెలా సుమారు 70 మంది రేషన్ కార్డుదారులకు బియ్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గట్టిగా నిలదీస్తే వేలిముద్రలు వేయించుకుని టోకెన్లు పంపిణీ చేసి మరుసటి నెల బియ్యం ఇస్తామని కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. చాలామంది పేదలు రేషన్ బియ్యంపై ఆధారపడి జీవిస్తున్నారని, తహసీల్దార్ కార్యలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తమకు బియ్యం అందేలా చూడాలని వారు కోరారు.

నేడు బీరప్పచెరువులో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని బీరప్పచెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. గర్భిణులకు బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత పరీక్షలు చేసి తగు సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు ఎగువ వెంకటాపురంలో..

తవణంపల్లె: మండలంలోని ఎగువ వెంకటాపురంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఉంటుందని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఎగువ వెంకటాపురం పరిసర గ్రామాల్లోని ప్రజలు ఈ శిబిరంలో వైద్యులు అందించే వైద్యసేవలు పొందాలని కోరారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య పోటీలు

చితూరు రూరల్: చిత్తూరు నగరంలోని రెవెన్యూ భవనంలో ఆదివారం నిర్వహించిన శాస్త్రీయ నృత్య పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రజాహిత సేవ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు చిత్తూరు నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు. తనదైన శైలిలో ప్రదర్శనలు ఇచ్చి ఆహూతులను అలరించారు. ప్రతిభ కనబరిచిన వారికి సంస్థ అధ్యక్షులు రాజరత్నంరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

త్వరలో ఈ లోకానికి వస్తా..!

- భక్తి శ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- దైవసందేశం వినిపించిన పాస్టర్లు
- కిక్కిరిసిపోయిన చర్చిలు





చిత్తూరు టౌన్‌చర్చిలో యేసు పునరుత్థానంపై ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ డాల్విన్ క్రిస్టియన్ దాస్, ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలో ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచి పలు చర్చిల్లో ఈస్టర్ వేడుకలు కనుల పండువగా ప్రారంభమయ్యాయి. గుడ్‌ఫ్రైడే రోజు శిలువపై అశువులు బాసిన యేసు ప్రభువు మూడో రోజున సమాధి నుంచి భక్తులకు దర్శనమిస్తాడు. కాళ్లు, చేతులకు కొట్టిన మేకుల గాయాలను చూసి గుర్తెరిగి యేసయ్య లేచి వచ్చాడని ఆనందోత్సాహాలతో ఉప్పొంగిపోతారు. 'త్వరలో ఈ లోకానికి వస్తా అప్పటి వరకు నేనున్నానని తెలియజేయండి' అని యేసు వెళ్లి పోతారు. దీనినే క్రైస్తవులు ఈస్టర్ (పునరుత్థాన పండుగ)పండుగగా జరుపుకుంటారు. ఈ వేడుకలు చర్చివీధిలోని టౌన్ చర్చి, జాన్ బాస్కో చర్చి, బీటీ మెమోరియల్ చర్చి, తెలుగు లూక్ చర్చిల్లో ఘనంగా నిర్వహించారు. ప్రసంగాలు, ప్రార్థనలు చేశారు. టౌన్ చర్చి పాస్టర్ రెవరెండ్ డాల్విన్ క్రిష్టియన్ దాస్ ప్రభోదిస్తూ, మరణాన్ని జయించి తిరిగి సజీవుడైన దేవుడు, యుగయాగాలకు సజీవుడై ఉండే యేసయ్య అని అన్నారు. లోకాన్ని, మరణాన్ని జయించిన దేవుడు, సృష్టికి మూలం ఆరాధ్య దైవం యేసు ప్రభువేనన్నారు. చర్చిలన్నీ క్రైస్తవులతో కిక్కిరిసిపోయాయి.

చీరల పంపిణీ

చిత్తూరు నగరం చెన్నమ్మగుడిపల్లిలోని ప్యూర్ గాస్పల్ చర్చిల్లో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి సతీమణి ఇందు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అన్నదానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అంజిలిరెడ్డి, మునిరత్నం, చెన్నయ్య, చిట్టిబాబు, జ్యోతి ప్రసాద్, మేరీ, కవిత, దయానిధి, గోపాల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పండుగ

తవణంపల్లె: మండలంలోని తవణంపల్లె, పైపల్లె క్రాస్‌లోని జీఎఫ్‌ఐ చర్చి, ఎగువ తవణంపల్లె, ఎగువ మత్యం, దిగువమత్యం, దిగువ తడకర, వీర్లగుడిపల్లె, అరగొండ, గాజులపల్లె, తొడతర, చెర్లోపల్లె తదితర గ్రామాల్లోని చర్చిల్లో ఏసుక్రీస్తు పునరుత్థానం గురించి పాస్టర్లు తెలియజేశారు. అనంతరం చర్చిల్లో ప్రార్థనలు పాడుతూ, పాటలు పాడి ఆనందంగా గడిపారు. ఒకరికి ఒకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సత్యం పట్ల విశ్వాసానికి ఉన్న శక్తిని తెలిపిన మహిమాన్వితమైన రోజు ఈస్టర్ పండుగ అని పాస్టర్లు తెలిపారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

గుడిపాల: మండలంలోని పలు చర్చిల్లో ఆదివారం ఘనంగా ఈస్టర్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల్లో పాస్టర్‌లు మాట్లాడుతూ ప్రభువైన ఏసు మూడవ దినం తిరిగి రావడం ద్వారా మానవులకు ఆత్మరక్షణ కలిగిందన్నారు. ప్రజలు సుఖసంతోషాలు ఉండడం కోరుకోవడం ద్వారా శాంతి దొరుకుతుందని చెప్పారు. ఏసుక్రీస్తు ప్రభువు పనురుత్థానాన్ని జ్ఞాపకం చేసుకొని ఆరాధించారు. అనంతరం యువతీ, యువకులు గీతాలాపన చేశారు. అనంతరం కొన్ని చర్చిల్లో అన్నదానం చేశారు.





చిత్తూరు: చర్చిలో చీరలు పంపిణీ చేస్తున్న విజయానందరెడ్డి సతీమణి ఇందు, తవణంపల్లె: ప్రసంగిస్తున్న పాస్టర్



గుడిపాల: ఈస్టర్ వేడుకల్లో ప్రసంగిస్తున్న పాస్టర్, పాల్గొన్న క్రైస్తవులు

మూడు పుస్తకాల ఆవిష్కరణ



మూడు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

పలమనేరు: ఎమ్మెస్సార్ ఎడ్యుకేషనల్ ట్రస్టు తరపున జాతీయ స్థాయిలో నిర్వహించిన కథల పోటీల్లో బహుమతులు పొందిన రచయితలకు హైదరాబాదులోని రవీంద్రభారతిలో జాతీయ స్థాయి సాహిత్య పురష్కారాల కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ అవార్డును స్థానిక కవి, చయిత జుజ్జూరి వేణు అందుకున్నారు. దీంతోపాటు కథలతో కథ ప్రపంచం, నవల సాక్ష్యాత్కారం, లోపలేదో కదులుతున్నట్టు అనే మూడు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇందులో కార్యక్రమ నిర్వాహకులు మలిశెట్టి శ్యాంప్రసాద్, సాహితీవేత్తలు వాడ్రేవు చిన వీరభద్రుడు, మాజీ ఐఏఎస్ అధికారి యాకూబ్, ఏకే ప్రభాకర్, పలమనేరు బాలాజి పాల్గొన్నారు.